# వంశోద్ధారా

కెప్టెన్ షేక్ మౌలాలీ

ఏడు పదులు నిండిన జగన్నాథం చెవికి యజ్ఞోపవీతం చుట్టి, చేతిలో చెంబుతో మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి వీథి వాకిట్లో అరుగుమీద కూర్చుని నిట్టూర్చాడు.

రెండు నిమిషాలయ్యేక మెల్లగా లేచి లోపలికి నడిచాడు. బావి దగ్గర కచ్చిక మసితో బోసి నోటిని శుభ్రపరచి, నాలుగు చెంబులు నీళ్ళు తలమీద పోసుకుని, ఆదిత్యుడికి చేతులు జోడించి, వసారాలోకి వచ్చి వణికే చేతుల్తోనే నుదుట నామం ధరించాడు. పొడి ధోవతి చుట్టుకుని మంచంలో కూలబడ్డాడు.

''ఇదిగో కాఫీ!'' అంటూ చిరాగ్గా మంచం క్రింద గ్లాసు పెట్టింది కోడలు కామాక్షి.

గ్లాసు అందుకుని మెల్లగా గొంతులో పోసుకున్నాడు జగన్నాథం.

మెల్లగా ప్రక్కకు వాలాడు. కొంచెం కునుకు పట్టింది. లోపల నుంచి వచ్చే కేకలకు నిద్రా భంగమయి మెలకువ వచ్చింది.

''నిజమేరా! మీకు స్కూలు ఇనస్పెక్టరు వస్తున్నాడు. అయితే ఆయనగారు వస్తున్నాడని కొత్త చొక్కా ఉన్న పళాన ఎక్కడ నుంచి తేను?'' కామాక్షి కొడుకును గదమాయిస్తోంది.

''నాన్నకు చెప్పి కుట్టించమ్మా! మళ్ళీ సంవత్సరం దాకా అడగను కదా!'' కొడుకు బతిమాలుతున్నాడు.

''మీ నాన్నకే అంత శక్తి వుంటే ఇంత రాద్ధాంతం ఎందుకు నాయనా! నువ్వేమైనా ఆఫీసరు కొడుకువయితే పూటకో జత బట్టలు మార్చి వుండేవాడివి! ఎవరికెంత



GEET MALA GM CASSETTES

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక

మీ పౌరాణిక పరిజ్ఞానాన్ని పరీక్షించుకోండి

## పురాణకథల క్విజ్

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తూన్న 'పురాణ కథలు' శీర్షికకు అనుబంధంగా పాఠకులకు ఆసక్తికరమైన క్విజ్ త్వరలో ప్రారంభిస్తున్నాము.

భారత, రామాయణాలు, పురాణ కథలు ఆధారంగా గీత్ మాల, విజయవాడ వారు యీ క్విజ్ నిర్వహిస్తున్నారు. ఈ 'పురాణ కథల క్విజ్'లో పాల్గొని అన్ని జవాబులూ సరిగా వ్రాయగలిగిన పాఠకుల నుంచి ప్రతివారం లాటరీ ద్వారా ఒక విజేతను ఎంపిక చేస్తాము. ఏ వారానికి ఆ వారం గెలుపొందిన పాఠకుడికి గీత్ మాలా వారు శ్రీ ప్రయాగ రామకృష్ణ చెప్పిన 'భారతంలో చిన్నకథలు' ఆడియో కేసెట్‌ను బహుమతిగా నేరుగా పంపుతారు.

- ఎడిటర్

'పురాణకథల క్విజ్' త్వరలో ప్రారంభం!

రాసుంటే అంతే ప్రాప్తం!'' తల్లి గొంతులో బాధ, వెటకారం రెండూ గమనిస్తూనే వున్నాడు మంచంలో మంచి జగన్నాథం.

''నువ్వు చచ్చి సుఖంగా వున్నావు! నేను మాత్రం బతికుండి అనుక్షణం చస్తున్నాను!'' అనుకున్నాడు భార్యను తల్చుకుని.

ఇద్దరు కొడుకులు రామలక్ష్మణులని భార్య అంటుంటే, తన రెండు కళ్ళని తాను భావించేవాడు.

మెలకువ వచ్చినా కళ్ళు మూసుకునే పడుకున్నాడు.

''వెళ్ళి నాన్నతో చెప్పు బియ్యం నిండుకున్నాయని! ఎక్కడ పేకాట ఆడుతూ కూర్చున్నాడో! ఎక్కడైనా కాసిని తెస్తేనే మధ్యాహ్నం భోజనం!'' కామాక్షి స్వరం యథార్థం పలుకుతుంది.

''క్షుద్బాధే గాఢ నిద్రః'' అన్నట్టు జగన్నాథం తిరిగి నిద్రలోకి వెళ్ళిపోయాడు.

కాని అరగంటలోపుగానే మెలకువ వచ్చింది.

మళ్ళీ లోపల నుంచి కేకలు వినిపిస్తున్నాయి.

''మీ నాన్న పెద్ద చదువులు చదివి ఏదయినా ఆఫీసరు ఉద్యోగం చేస్తున్నాడనుకున్నావా, ఎప్పుడంటే అప్పుడు నువ్వడిగిందల్లా కొనివ్వడానికి! ఎవరి ప్రారబ్ధం వారిది!''

''నాన్న కూడా కొన్నాళ్ళు ఉద్యోగం చేశాడు కదమ్మా!'' పిల్లవాడి ప్రశ్న.

''ఆ! చేశాడులే మహా నాలుగేళ్ళు కరణీకం! అది ఊడి మూడేళ్ళయింది. ఆస్తి ఏమైనా వుందా అంటే, వున్న ఈ కాస్త ఇల్లు కూడా తాకట్టులోనే వుంది. మరి నాన్న ఏమీ తోచక ఆ పాడుబడిన పేకాట వ్యసనంలో పడ్డాడు.''

''ఏమిటే రాద్ధాంతం! ఇవిగో బియ్యం. ఇవాల్టికి వస్తాయి. రేపటి విషయం తర్వాత చూద్దాం!'' అన్నాడు గోపాలం భార్యకు సంచి అందిస్తూ.

మధ్యాహ్నం భోజనం అయిందనిపించారు అంతా.

జగన్నాథం వచ్చేచెడి చార్జీ డబ్బులు బదులు సంపాయించి, రాజధాని నగరంలో నెలకు మూడువేలు సంపాయిస్తున్న జ్యేష్ఠ పుత్రుడు రామేశం వద్దకు వెళ్ళాడు.

తెల్లవారుఝామున తలుపులు తట్టిన చప్పుడుకు లేచి తండ్రిని చూడగానే 'షాక్' తిన్నంత పనయింది రామేశానికి.

ఎనిమిది గంటలయ్యేసరికి, భార్య అందించిన అన్నం గిన్నె అందుకుని, ఇద్దరు పిల్లల్ని స్కూటరుపై ఎక్కించుకుని వెళ్ళిపోయాడు రామేశం.

స్నానం చేసి, భోజనం ముగించి, వరండాలో మంచంలో వాలిన జగన్నాథానికి మెలకువ వచ్చేసరికి సాయంత్రం అయిదు అయింది. కోడలు అందిచ్చిన కాఫీ తాగాడు.

సంధ్యవేళ ఏడుగంటలకు రామేశం స్కూటరు మీద ఇద్దరు పిల్లల్ని కూర్చోబెట్టుకుని ఇల్లు చేరాడు. అతని ముఖంలో అలసట, విసుగు, చిరాకు ప్రస్ఫుటమవుతున్నాయి. స్నానం చేసి భోజనం అయ్యేసరికి తొమ్మిది గంటలు కొట్టింది. పడక గదిలోకి వెళ్ళి గడియ వేసుకున్నాడు.

నాలుగు రోజులు గడిచాయి. రామేశం తండ్రితో తృప్తి తీర మాట్లాడలేదు. జగన్నాథం కూడా కుమారుని విసిగించదలుచుకోలేదు.

ఆదివారం వచ్చింది. ఎక్కడో పార్టీ వుందని రామేశం ఉదయాన్నే ఇంటికి తాళం పెట్టి భార్యా పిల్లలతో బయలుదేరి వెళ్లి రాత్రి పదిగంటలకు గాని తిరిగి రాలేదు.

కోడలు గిన్నెలో పెట్టి వెళ్ళిన అన్నం తిని జగన్నాథం ఒంటరిగా వరండాలో పడి వున్నాడు.

''మామయ్యా! మేమంతా అక్కడే రాత్రి భోజనం కూడా చేసివచ్చాం! ఇప్పుడు మీ వరకే వంట చేయాలి! చెయ్యమంటారా?'' అడిగింది కోడలు.

ఎన్నో జీవితపు మలుపులు అనుభవించిన జగన్నాథానికి కోడలు కంఠంలోని ధ్వని బాగా అర్థమయింది.

''మధ్యాహ్నం అన్నం కొంచెం ఆలస్యంగా తిన్నానమ్మా! ప్రస్తుతం నాక్కూడా ఆకలిగా లేదు'' అని ముసుగదీసుకుని పడుకున్నాడు.

నెల రోజులు గడిచాయి. వృద్ధాప్యపు చాపల్యం లేకపోగా, జగన్నాథంలో సంయమనం ఎక్కువ కాసాగింది. మధ్యలో చాలాసార్లు ఎవరెవర్నో తీసుకొచ్చి అతిథి మర్యాదలు చేస్తుండేవాడు రామేశం. కాని కన్న తండ్రితో నోరు విప్పి ఆత్మీయంగా మాట్లాడడానికి మధ్యలో ఏదో అడ్డు తెర వచ్చినట్లుగా ప్రవర్తిస్తుండేవాడు. అయినా జగన్నాథం నిర్లిప్తంగా, ప్రశాంతంగా కాలం గడుపుతున్నాడు.


మరో మాసం గడిచింది.

ఒకనాటి ఉదయం ఆఫీసుకు వెళ్ళబోతూ ''నాన్నా! నాకు పేరుకు మాత్రమే మూడు వేల రూపాయిల జీతం! అందులో ఇన్‌కమ్ టాక్స్, సేవింగ్స్,

అద్దె, పిల్లల చదువులు, స్కూటరు మెయింటెనెన్స్ వగయిరాలన్నీ పోతే, ఇక మిగిలేది చాలా తక్కువ. ఇల్లు చిన్నది అయినా అద్దె ఎక్కువ, వచ్చేది చలికాలం. కిచెన్ కమ్ డైనింగ్ హాల్, పిల్లలగది, మా బెడ్‌రూం— మూడు గదులు సరిపోయాయి. వరండాలో చలి మూలంగా నువ్వు పడుకోలేవు. ఇంతకంటె పెద్ద ఇల్లు తీసుకునే తాహతు నాకు లేదు. పైగా నీ ఖర్చు భరించటం కూడా కష్టంగానే వుంది. నీ మూలాన నెలకు రెండు వందలు అప్పుకూడా కాసాగింది. ఈ నెల కూడా మరి కొంత అప్పు అవుతుంది. వీలునుబట్టి ఎప్పుడయినా కొంత డబ్బు పంపిస్తుంటాను. నువ్వు తమ్ముడి దగ్గరే వుండు.

అసలు నువ్వు జీవితమంతా ముందుచూపు లేకుండా గడిపావు. ఇప్పుడు నేను చేస్తున్నట్లు కొంత డబ్బు నువ్వు ఏ బ్యాంకులోనో దాచుకొని మిగుల్చుకొని వుంటే, ఇప్పుడు నీకు ఇంత ఇబ్బంది వుండేది కాదుగదా! సంపాయించిందంతా గోపాలానికే తినబెట్టావు. నా చదువుకి గాను నువ్వు పెద్దగా ఖర్చుపెట్టింది కూడా ఏమీ లేదు. నా చదువంతా స్కాలర్‌షిప్‌మీదనే సాగింది. నిన్ను పోషించవలసిన బాధ్యత గోపాలంది!'' అన్నాడు నిర్మొహమాటంగా.

కుమారుని కటువచనాలకు జగన్నాథం హృదయం తల్లడిల్లలేదు! మరునాడు ఉదయాన్నే బయలుదేరాడు.



కేప్టెన్ షేక్‌మౌలాలి

రోడ్డుమీద మెల్లగా అడుగులేస్తున్న జగన్నాథానికి వనవాసానికి వెళుతున్న శ్రీరాముడు మదిలో మెదిలాడు. పట్టాభిషేకవార్త, వనవాసవార్త రెండూ ఆయనకు ఆనందప్రదాలుగ భాసించాయి. తనూ అంతే! రామాయణ మహాకావ్యంలో చాలాసార్లు వాల్మీకి మహర్షి ''కాలోహి దురతి క్రమః'' అంటాడు. నిజమే! ఎంతటివాడు కూడా కాలానికి తల వంచాల్సిందే,

కాని జగన్నాథంలో శ్రీరాముని కున్నంత బలం లేదు. రకరకాల ఆలోచనలు బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. అడుగులు తడబడుతుండగా, ఎదురుగ్గా వచ్చే కారు అద్దాలపై పడిన సూర్యకాంతి వివిధ కోణాలలో పరావర్తనం చెంది జగన్నాథం కళ్ళలో జిగేల్-జిగేల్ మనడంతో తూలిపడ్డాడు.

జగన్నాథానికి స్పృహవచ్చే సరికి సంధ్యవేళ అయింది. తన కళ్ళలోకే ఆదుర్దాగా చూస్తున్న యువకుడ్ని మెల్లగా గుర్తించగలిగాడు. తర్వాత మెల్లగా చుట్టూ కలియ చూశాడు. పైన ఫ్యాను తిరుగుతుంది. తన చేయి కదలకుండా మంచానికి కట్టబడి వుంది. ప్రక్కన స్టాండుకు సెలైన్ బాటిల్ వ్రేలాడుతుంది.

జగన్నాథం పెదాలు మెల్లగా కదిలి ''గోవిందా!'' అనే శబ్దం వెలువడింది.

''అవును మాస్టారూ! నేనే! గోవిందరావును! కొంచెంలో ఘోరమయిన ప్రమాదం తప్పింది. లేకుంటే నా కారు క్రిందనే పడి వుండేవారు!

అదిసరే! మీరు ఇక్కడకు వస్తున్నట్లు రామేశానికి ఉత్తరం రాస్తే, తనే స్వయంగా స్టేషనుకు వచ్చి ఇంటికి తీసుకెళ్ళేవాడుగా! ఊరికి కొత్త, పెద్ద వయస్సు, ఊపిరి సలపని ట్రాఫిక్- ఏదయినా ప్రమాదం జరిగితే!

మిమ్మల్ని హాస్పిటల్లో చేర్పించి, హడావిడి తగ్గాక రామేశానికి ఫోను చేశాను. పదిహేను రోజులు సెలవు పెట్టి భార్యాపిల్లలతో కాశ్మీర్ టూర్ వెళ్ళాడని చెప్పారు.

బాగా నీరసంగా వున్నారు. మూడు రోజులు ఇక్కడే వుండమని చెప్పారు డాక్టర్. దేనికైనా మంచిదని



# బి.ఎన్.భాషితాలు

—వాస్తుశిల్పి బి.ఎన్.రెడ్డి

## ఆత్మ విశ్వాసం

కుంభ వర్షం కురిసినా
బోర్లించిన కుండలో నీరు నిలవనట్లే
ఆత్మ విశ్వాసం లేని వాడు
విశ్వమంతా తిరిగినా వీసమెత్తు సాధించలేడు-





## ఆత్మజ్యోతి

నవ రంధ్రముల దేహంలో
ఒక జ్యోతి ప్రకాశిస్తున్నది
ఆ ఆత్మజ్యోతిని దర్శించు
ఆత్మసాక్షాత్కారం సంపాదించు-

## లక్ష్యం

లక్షణంగా పెద్ద చదువులు చదువుకోవాలన్నా
సలక్షణమైన ఉద్యోగం కావాలన్నా
లక్షలకు లక్షలు సంపాదించాలన్నా
లక్ష్యమనేది ఒకటుండాలి మనిషికి-



కంపెనీకి వారం రోజులు సెలవు పంపాను నేను. మీరే మాత్రం భయపడాల్సిన అవసరం లేదు. నేను మీ ప్రక్కనే వుండి రామేశం లేని లోటు రాకుండా మాస్తాను" అన్నాడు.

కాంపౌండర్ వచ్చి సెలైన్ బాటిల్ తీసేశాడు. గోవిందరావు భార్య పిల్లలతో సహావచ్చి, ఫ్లాస్కులో తెచ్చిన బత్తాయిరసం గ్లాసులో పోసి ఇచ్చింది.

వణుకుతున్న చేతుల్తో గ్లాసు అందుకున్నాడు జగన్నాథం. అప్రయత్నంగా ఆయన కళ్ళు చెమర్చాయి.

"వేరుగా అనుకోకండి మాస్టారూ! నన్ను రామేశంగా, ఈమెను మీ కోడలుగా భావించండి. మీ కేలోటు రానీయం... రామేశం రాగానే కబురు చేస్తాగా.

నా చిన్నతనంలో మీరు చెప్పిన మాటలు నాకు బీజాక్షరాలుగా పనిచేశాయి. 'శ్రమ' ఎప్పటికైనా ఫలిస్తుందని చెప్పారు. మీ చలువవలన బి.హెచ్.ఇ.ఎల్.లో ప్రొడక్షన్ ఇంజనీరుగా పనిచేస్తున్నాను. మన ఊళ్ళో నాకేం ఆస్తిలేదు కదా! అమ్మా నాన్నా ఇక్కడ నా దగ్గరే వుండేవాళ్ళు. వయసు పండి రాలిపోయారు.

మాస్టారూ! అన్నట్లు చెప్పటం మరిచా! డెప్యుటేషన్ మీద అమెరికాలో ఒక సంవత్సరం వుండి, నాలుగు రోజుల క్రితమే వచ్చా!"

గోవిందరావు ఏకధాటిగా చెప్పుకుపోతున్నాడు.


కాంపౌండర్ వచ్చి ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళాడు.

జగన్నాథం కళ్ళు మూసుకున్నాడు. ఆయన మనస్సు పరిపరి విధాలపోతుంది. జీవితంలో ఎందరికో అక్షరాలు దిద్దపెట్టాడు. క్షేత్రంలో చల్లిన విత్తనాలు, అక్కడగల భూసారాన్నిబట్టి ఫలించినట్లు తన మాటలు గోవిందరావులో బాగా భాసించాయి. కష్టపడి చదివాడు. ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇచ్చింది... ఇందులో తన ప్రసక్తి నామమాత్రం కూడా లేదనిపించింది.

మూడు రోజులు గడిచాయి. అరుణభానుడు తృప్తిగా కొండల మాటుకు వెళుతున్నాడు. కారు వచ్చి క్వార్టర్లు ముందు ఆగింది. గోవిందరావు, జగన్నాథం దిగారు.

జగన్నాథం ఆ ఇంట్లో చిన్న పిల్లాడిలా ఇమిడిపోయాడు. తనకొక 'గది' అంటూ లేదు. ఎక్కడ కావాలనుకుంటే అక్కడ కూర్చుంటాడు. కూర్చున్న చోటే కునుకుతీస్తాడు. బెడ్‌రూం, డ్రాయింగ్ రూమ్, పిల్లలగది, కిచెన్— సర్వం తనవే, తన స్వంత కొడుకు ఇంట్లో తను పరాయి వాడయ్యాడు. కాని, ఇక్కడ అంతా తన ఇష్టం.

పిల్లలు ఎప్పుడూ తనను చుట్టేసుకు తిరుగుతుంటారు. గోవిందరావు భార్య నిండు హృదయంతో ఎంతో ఆత్మీయంగా ఆదరిస్తుంది. ఇక గోవిందరావు




వచ్చేపోయే అతిథులకు తనను పరిచయం చేస్తుంటే వారంతా చేతులు జోడించి నమస్కరిస్తుంటారు.

మరో పది రోజులు గడిచాయి. సోఫాలో కూర్చున్న జగన్నాథంకు తన చిన్నవాడు ఉపాధ్యాయుడు చెప్పిన ధర్మసూత్రం స్మృతిపథంలో మెదిలింది— వంశం రెండు విధాలు. మొదటిది విద్యావంశం, రెండవది జన్మవంశం. జన్మవంశం ఎప్పటికయినా చెడటానికి అవకాశం వుంది— శారీరకం కనుక. కాని ఆత్మధర్మ ప్రధానమయిన విద్యావంశం అనుక్షణం వినూత్న తేజస్సుతో వర్ధిల్లుతుంటుంది.

తన జీవితంలో కూడా అదే జరిగింది. కన్నబిడ్డలకు తాను బరువయితే, అక్షర జ్ఞానం పొందిన గోవిందుడు తనపై అమృతవర్షం కురిపిస్తున్నాడు.

జగన్నాథం పెదాల నుండి అప్రయత్నంగా—

"వంశోద్విధా విద్యయా జన్మనాచ" అనే శబ్దాలు వెలువడ్డాయి.

అప్పుడే వచ్చిన గోవిందరావు "ఏమిటి మాస్టారూ అంటున్నారు! అన్నట్లు మరిచాను. రామేశం రెండు రోజుల్లో కాశ్మీరు నుండి వస్తాడు. ఫోనుచేసి మీరొచ్చారని చెప్తా!" అన్నాడు.

గోవిందరావు చేయి అందుకొని తన ప్రక్కన కూర్చొనబెట్టుకున్నాడు జగన్నాథం.

"వద్దు! రామేశానికి నా వివరాలేమీ తెలియనీయ వద్దు! నీకు అభ్యంతరం లేకపోతే... నేను పోయేటంతవరకూ ఇక్కడే వుంటా!" అన్నాడు అతని అరచేతిని తన అరచేత్తో రాస్తూ.

"నా కంతటి అదృష్టమా మాస్టారూ! మీరు నా దగ్గర వుంటానంటే, అంతకంటే మహద్భాగ్యం ఏముంటుంది!" అన్నాడు పరమానందంగా గోవిందరావు.